


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




శనివారం 12-09-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :86 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## దేశాధినేతలతో మోదీ వరుస భేటీలు!



2 లో

- పుతిన్, పెజెష్కియాన్‌లతో ప్రధాని భేటీలు
- జిన్‌పింగ్ రాకపై సర్వత్రా ఉత్కంఠ
- ఏడేళ్ల తర్వాత భారత్‌లో అడుగుపెడుతున్న చైనా అధ్యక్షుడు
- మోదీ-జిన్‌పింగ్ భేటీపై ప్రపంచం చూపు
- రక్షణ, దౌత్య సంబంధాలపై పుతిన్‌తో చర్చలు
- ఐరాస సెక్రటరీ జనరల్‌తోనూ కీలక సమావేశం
- వాణిజ్యం, టెక్నాలజీపై బ్రిక్స్ దేశాల దృష్టి

## సీఎం బ్రదర్స్ భూదందా?

- భూములపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- కోటి ఎకరాలు 22ఏ జాబితాలోనా?
- రైతులను ఇబ్బంది పెడుతున్నారంటూ ఫైర్
- సీఎం బ్రదర్స్‌పై భూదోపిడీ ఆరోపణలు
- సమాంతర రెవెన్యూ వ్యవస్థ నడుస్తోందని విమర్శ
- ఫ్యూచర్ సిటీ భూములపై ప్రశ్నలు
- కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ మండిపాటు
- రెండేళ్లలో కేసీఆర్ సీఎం అవుతారన్న ధీమా


2 లో

**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న భూములను సీఎం రేవంత్ రెడ్డి హారతి కర్పూరంలో కాజేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. 22ఏ నిషేధిత భూములపై తెలంగాణ భవన్‌లో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. శాసనసభలో ప్రజ సమస్యలపై మాట్లాడనివ్వకుండా తమ పార్టీ ఎమ్మెల్యేలను మెడ పట్టి గెంటేశారని ఫైర్ అయ్యారు. సీఎం బాగోతాలు బయటపడతాయనే భయంతోనే తమను శాసనసభ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ల్యాండ్ చోరీ విపరీతంగా జరుగుతోందని, ఇందిరమ్మ రాజ్యంలో భూములను దోచుకుంటున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు.

**నిషేధిత జాబితాలో కోటి ఎకరాలు..**

బీఆర్ఎస్ హయాంలో 22ఏ కింద కేవలం 16 లక్షల ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండగా.. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత దానిని కోటి 16 లక్షల ఎకరాలకు పెంచారని కేటీఆర్ ఆరోపించారు.

## కులగణనలో తెలంగాణ రోల్ మోడల్!

- 2027 జనగణనలో బీసీ లెక్కలు చేర్చాలి
- బీసీల జనాభాపై మా దగ్గర పక్కా గణాంకాలు
- 42 శాతం రిజర్వేషన్లకు తెలంగాణ అడుగులు
- 50 శాతం పరిమితి దాటేందుకు శాస్త్రీయ ఆధారాలు
- జనాభా ప్రాతిపదికన బీసీలకు న్యాయం చేయాలి
- కేంద్రం కూడా తెలంగాణ బాటలో నడవాలి
- బీసీ కులాల లెక్క తేల్చాలన్న పొన్నం

2 లో

## ఐటీ జాబ్స్‌కు తెలంగాణ బిగ్ బూస్ట్!

- కొత్త జీసీసీ పాలసీకి కసరత్తు
- 75కు పైగా జీసీసీల ఏర్పాటు
- లక్ష మంది యువతకు ఉద్యోగాలు
- టైర్-2 నగరాలకు ఐటీ విస్తరణ
- మూతపడిన ఐటీ హబ్‌లకు పునర్జీవం
- త్వరలో ఆదిలాబాద్ ఐటీ హబ్
- డేటా సెంటర్లపై ప్రత్యేక దృష్టి


2 లో

**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (ఇది కద నిజం):** గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన ఐటీ హబ్స్, టవర్లపై అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. యాంకర్ పార్ట్‌నర్స్ లేదా ఇండస్ట్రీ పార్ట్‌నర్స్ భాగస్వామ్యం లేకుండానే గతంలో వీటిని నిర్మించడం వల్ల చాలా చోట్ల ఇవి నిరుపయోగంగా మారాయని తెలిపారు. నిజామాబాద్ ఐటీ టవర్, ఐటీ హబ్‌పై శాసనసభ్యుడు అడిగిన ప్రశ్నకు శ్రీధర్ బాబు శాసనసభ వేదికగా సమాధానమిచ్చారు. ప్రణాళికారాహిత్యంతో మూతపడిన ఐటీ హబ్‌లను తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని స్పష్టం చేశారు.

"హైదరాబాద్‌పై ఒత్తిడిని తగ్గించేందుకు.. నల్గొండ, ఆదిలాబాద్, మహబూబ్ నగర్, కరీంనగర్ లాంటి టైర్ - 2 నగరాలకూ ఐటీ కంపెనీలకు విస్తరిస్తున్నాం.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్‌లో భారత్ రికార్డు!

- 80 లక్షలు దాటిన టీకా డోసుల పంపిణీ
- గర్భాశయ క్యాన్సర్‌కు ముందస్తు రక్షణ
- 14 ఏళ్ల బాలికలే ప్రధాన టార్గెట్
- ప్రభుత్వ కేంద్రాల్లో ఉచితంగా సింగిల్ డోస్
- ఆంధ్రప్రదేశ్‌లో 98 శాతానికి పైగా వ్యాక్సినేషన్
- 81 శాతంతో రెండో స్థానంలో తమిళనాడు

2 లో

## మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ

- తెలంగాణ సర్కార్‌కు నోటీసులు జారీ
- పర్యావరణ అనుమతులపై రిటైర్డ్ ఇంజినీర్ల పిల్
- 55 కిలోమీటర్లలో 20 కిలోమీటర్లపైనే స్టే?
- మృగవాణి నేషనల్ పార్క్‌పై ఆందోళన
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ వద్ద నిర్మాణాలపై అభ్యంతరం
- వచ్చే నెల 16కు తదుపరి విచారణ
- ప్రాజెక్టుపై మళ్లీ మొదలైన న్యాయ వివాదం

2 లో

## నెట్‌వర్క్ రాలేదని.. టవర్‌కు కట్టేశారు!


2 లో

**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (ఇది కద నిజం):** మొబైల్ ఫోన్‌లో నెట్‌వర్క్ సరిగ్గా రాకపోతే ఎవరికైనా చిర్రెత్తుకొస్తుంది, కానీ ఉత్తరప్రదేశ్‌లోని కొందరు గ్రామస్థులు మాత్రం ఆ కోపాన్ని పరాకాష్టకు తీసుకెళ్లారు.

## నాలుగేళ్ల చిన్నారిపై పైశాచికం!


2 లో

- స్కూల్లో రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి అఘాయిత్యం
- రక్తస్రావంతో ఇంటికి చేరిన చిన్నారి
- తల్లికి విషయం చెప్పడంతో వెలుగులోకి ఘటన
- నిందితుడిపై పోక్సో కేసు.. అరెస్ట్
- ఆగ్రహంతో స్కూల్‌పై బంధువుల దాడి
- 170 విద్యార్థులను ప్రభుత్వ స్కూల్‌కు తరలింపు

# గ్రామ ఖజానాకు గ్రీన్ సిగ్నల్



**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణలో గ్రామ పంచాయతీలకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీలకు వచ్చే ఆదాయాన్ని ఇకపై ప్రభుత్వ ఖజానాకు జమ చేయాల్సిన అవసరం లేదు. స్థానిక అవసరాల కోసం ఈ నిధుల్ని ఖర్చు చేసేందుకు ఖజానా ఆమోదం తీసుకోవాల్సిన పనిలేదు. ఆయా పంచాయతీలలో గ్రామసభ ఏర్పాటుచేసి తీర్మానం చేయాల్సి ఉంటుంది.. ఆ నిధుల్ని గ్రామంలోని పారిశుద్ధ్యం, తాగునీరు, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు, ఇతర స్థానిక అవసరాలకు వినియోగించుకోవచ్చు. ఈ మేరకు అసెంబ్లీలో ఈ అధికారాలను స్థానిక సంస్థలకు కల్పించేలా.. రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 70 సబ్‌సెక్షన్ 3కు సవరణ కోసం ప్రవేశ పెట్టి ఆమోదం తెలిపారు.

మిగతాది 2 లో..

- పంచాయతీలకు సొంత నిధుల పవర్
- ఇక ట్రెజరీకి జమ అవసరం లేదు
- గ్రామసభ తీర్మానంతో నిధుల ఖర్చు
- గ్రామ అవసరాలకే ఆదాయం వినియోగం
- పారిశుద్ధ్యం.. తాగునీటికి నిధులు
- స్ట్రీట్ లైట్లకు సొంత డబ్బులు
- 2018 చట్టానికి అసెంబ్లీ సవరణ
- పంచాయతీలకు నెలకు రూ.50 కోట్లు
- మాజీ సర్పంచ్‌ల బిల్లులపై పరిశీలన

## యువత సత్తాతో భారత్ జోరు!


- 2047 నాటికి వికసిత భారత్ ఖాయం
- యువశక్తిపై సందేహాలు వద్దు
- భారత ప్రగతికి యువతే బలం
- యూపీఐతో డిజిటల్ దూకుడు
- ప్రపంచంలో వేగవంతమైన ఆర్థిక వ్యవస్థ
- అంతరిక్ష రంగంలో కొత్త సరిహద్దులు
- నిరాశావాదుల మాటలు పట్టించుకోవద్దు
- యువత సామర్థ్యాలే సజీవ నిదర్శనం


2 లో

**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (ఇది కద నిజం):** భారత దేశంలోని యువశక్తి సామర్థ్యంపై సందేహాలు అవసరం లేదని 2047 నాటికి 'వికసిత భారత్' ఖాయమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ముంబైలో జరుగుతున్న 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు.. బిలియన్ల కొద్దీ లావాదేవీలను సునాయాసంగా ప్రాసెస్ చేస్తున్న యూపీఐతో ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించడం ..

## డీఎస్సీ-ఏపీపీఎస్సీ తేడా తెలుసా?

- జగన్ ఆరోపణలకు లోకేష్ కౌంటర్
- ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ కాలేదు
- 16 వేల టీచర్ పోస్టుల భర్తీ
- డీఎస్సీపై 300 కేసులు వేసినా..
- వైసీపీ ఆరోపణలకు ఆధారాలతో సమాధానం
- ఐదేళ్లలో 30 వేల పోస్టుల హామీ
- త్వరలో మరో డీఎస్సీ నోటిఫికేషన్



**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (ఇది కద నిజం):** మెగా డీఎస్సీ 2025 రిక్రూట్ మెంట్ లో అనేక అవకతవకలు జరిగాయని, అర్హత లేనివారికి ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు కట్టబెట్టారని మాజీ సీఎం జగన్ చేసిన ఆరోపణలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించారు. దీనిపై ఆయన ఎక్స్ లో ఒక వీడియో పోస్ట్ చేశారు. డీఎస్సీకి - ఏపీపీఎస్సీకి మధ్య ఉన్న తేడా ఏంటో నీకు తెలుసా జగన్? అని ప్రశ్నించారు. మీరు అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయలేదని విమర్శించారు. సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేశాక.. తొలిసంతకం డీఎస్సీపైనే పెట్టారని, అందుకే ఎంతో ప్రతిష్టాత్మకంగా 16 వేల టీచర్ల పోస్టుల్ని భర్తీ చేశామన్నారు.

డీఎస్సీని ఆపాలని కోర్టుకెళ్లినా, సుమారు 300 కేసులు వేసినా కోర్టు తమను తప్పు పట్టలేదన్నారు

2 లో

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

శనివారం 12-09-2026

## కులగణనలో తెలంగాణ రోల్ మోడల్!



**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (కుల సర్వే) దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాబోయే 2027 జాతీయ జనగణనలో బీసీ, ఓబీసీ కులగణనను తప్పనిసరిగా చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్రంలో బీసీల జనాభాపై తెలంగాణ ప్రభుత్వం వద్ద అత్యంత ప్రామాణికమైన, కచ్చితమైన గణాంకాలు ఉన్నాయని తెలిపారు. స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే అవసరమైన చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని దాటాలంటే సైంటిఫిక్ కుల గణాంకాలు చాలా అవసరమని, రాష్ట్రంలో విజయవంతంగా నిర్వహించిన సర్వే దానికి బలమైన ప్రాతిపదికగా నిలుస్తుందని మంత్రి వివరించారు. త్వరలో జరగబోయే దేశవ్యాప్త జనగణనలో బీసీ, ఓబీసీ వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని, బీసీలకు జనాభా ప్రాతిపదికన పూర్తి న్యాయం జరగాలని కోరారు. "బీసీల జనాభాను సరిగ్గా లెక్కించండి.. వారికి తగినంత న్యాయం చేయండి" అని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం సాధించాలన్న లక్ష్యంతోనే తమ ప్రభుత్వం ఈ కుల సర్వేను విజయవంతంగా పూర్తి చేసిందని, కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే బాటలో నడిచి బీసీ కులాల లెక్క తేల్చి న్యాయం చేయాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

## దేశాధినేతలతో మోదీ వరుస భేటీలు!

**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (ఇది కద నిజం):** బ్రిక్స్ సభ్య దేశాధినేతలతో ప్రధాని నరేంద్రమోడీ భేటీ కానున్నారు. రష్యా, ఇరాన్ దేశాధినేతలతో పాటు.. ఐక్య రాజ్య సమితి సెక్రటరీ జనరల్ తో మోడీ సమావేశం అవుతారు. తొలుత రష్యా అధ్యక్షుడు పుతిన్ తో, ఆ తర్వాత ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ తో, సాయంత్రం ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తో ప్రత్యేకంగా భేటీ అవుతారని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఇప్పటికే వీరంతా భారత్ కు చేరుకోగా.. చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ కూడా బ్రిక్స్ సమావేశానికి రానున్నారు. దాదాపు ఏడేళ్ల తర్వాత జిన్ పింగ్ భారత్ కు వస్తుండటంతో.. ప్రధాని, జిన్ పింగ్ ల భేటీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చివరిసారిగా ఆయన 2019లో చెన్నై సమీపంలోని మామల్లపురంలో ప్రధానితో అనధికారిక సదస్సు నిమిత్తం భారత్ కు వచ్చారు. అంతకుముందు 2016లో బ్రిక్స్ సదస్సుకు వచ్చారు.

18వ బ్రిక్స్ సమావేశానికి విచ్చేసిన పుతిన్ తో ప్రధాని భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు, కీలక రక్షణ ఒప్పందాలపై చర్చిస్తున్నారు. కాగా.. దేశ రాజధాని అయిన ఢిల్లీలో 12,13 తేదీల్లో బ్రిక్స్ సమావేశం జరుగనుండగా.. బ్రిక్స్ దేశాలైన బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా ప్రతినిధులు భారత్ కు చేరుకుంటున్నారు. ఈ సదస్సులో బ్రిక్స్ దేశాల మధ్య వ్యాపారాలను మరింత విస్తరించడం, టెక్నాలజీలో సహకారాన్ని పెంపొందించడం, ప్రధాన అంతర్జాతీయ సమస్యలపై చర్చించి, సమన్వయం చేసుకోవడం వంటి ప్రయోజనాలపై చర్చించనున్నారు.

## మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ




**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (ఇది కద నిజం):** రేవంత్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మళ్లీ న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ తాజాగా రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అయితే, మూసీ ప్రక్షాళన పేరుతో చేపడుతున్న పనులకు పర్యావరణ నిబంధనలు, అనుమతులు పూర్తి లోపభుయిష్టంగా ఉన్నాయి పిటిషనర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కి.మీ ఉంటే.. కేవలం 20 కి.మీ మేర మాత్రమే స్టడీ చేశారని పేర్కొన్నారు. అదేవిధంగా ఇదే రీజియన్‌లో మృగవాణి నేషనల్ పార్క్ కూడా ఉందని పేర్కొన్నారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ సమీపంలో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న నిర్ణయంతో పాటు వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా రిటైర్డ్ ఇంజినీర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతివాదిగా తెలంగాణ ప్రభుత్వం..

అయితే, పిటిషనర్ల అప్పీల్‌ను పరిశీలించిన చెన్నై ఎన్జీటీ బెంచ్.. ప్రతివాదులుగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం తన వాదనలను, సంబంధిత వివరాలను ట్రిబ్యునల్‌కు వెంటనే అందజేయాలని పేర్కొన్నది. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన ఓ పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేయగా తాజా పిటిషన్‌తో మరోసారి ప్రభుత్వానికి నోటీసులు రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

విచారణ వచ్చే నెల వాయిదా..

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణను ఎన్జీటీ వచ్చే నెల 16కు వాయిదా వేసింది. ఈ క్రమంలోనే ఆ రోజు జరిగే విచారణలో పర్యావరణ అనుమతులపై అప్పీల్‌దారులు లేవనెత్తిన అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు అత్యంత కీలకం కానున్నాయి. అయితే, మూసీ ప్రక్షాళనను మొదటి నుంచి ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తుండా.. తాజాగా మరోసారి నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌లో సదరు ప్రాజెక్టుపై పిటిషన్ దాఖలు కావడం హాట్ టాపిక్‌గా మారింది.

## నెట్‌వర్క్ రాలేదని.. టవర్‌కు కట్టేశారు!

మొదటి పేజీ తరువాయి

యూపీలోని ఫతేపూర్ జిల్లా హర్దొలీ గ్రామంలో గత కొద్ది రోజులుగా రిలయన్స్ జియో మొబైల్ సిగ్నల్స్ సరిగ్గా అందక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాల్స్ మాట్లాడటానికి, ఇంటర్నెట్ సేవలు వినియోగించుకోవడానికి తీవ్ర ఆటంకం కలుగుతుండటంతో గ్రామస్థుల్లో అసహనం కట్టలు తెంచుకుంది. సరిగ్గా ఇదే సమయంలో కంపెనీకి సంబంధించిన పనుల నిమిత్తం గ్రామానికి వచ్చిన ఓ ఉద్యోగిని గ్రామస్థులు చుట్టుముట్టారు.



ఆగ్రహంతో ఊగిపోయిన స్థానికులు అతడిని సమీపంలోని మొబైల్ టవర్‌కు తాళ్లతో కట్టేసి బంధించారు. తమ గ్రామంలో నెట్‌వర్క్ సమస్యను పూర్తిగా పరిష్కరించేంత వరకు అతడిని విడిచిపెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఉద్యోగిని టవర్‌కు కట్టేసిన దృశ్యాలను కొందరు స్థానికులు మొబైల్ ఫోన్లలో రికార్డు చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో ఆ వీడియోలు నెట్టింట క్షణాల్లో వైరల్‌గా మారాయి. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు వెంటనే హర్దొలీ గ్రామానికి చేరుకుని గ్రామస్థులతో చర్చలు జరిపారు.

అనంతరం బందీగా ఉన్న సదరు ఉద్యోగిని సురక్షితంగా విడిపించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరికాదని, సమస్యల పరిష్కారానికి అధికారులను, వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాలని పోలీసులు స్థానికులకు నచ్చజెప్పారు. ఈ విచిత్ర ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని పరిస్థితిని చక్కదిద్దేందుకు దర్యాప్తు ప్రారంభించారు.

## యువత సత్తాతో భారత్ జోరు!

మొదటి పేజీ తరువాయి

మొదలుకుని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలబడటం, అంతరిక్ష పరిశోధనల్లో నూతన సరిహద్దులను అధిగమించడం వరకు భారతదేశం తన జనాభా ప్రయోజనాన్ని (డెమోగ్రాఫిక్ డివిడెండ్) ప్రత్యక్షంగా అనుభవిస్తోందని స్పష్టం చేశారు. భారతదేశం సాధిస్తున్న అద్భుత ప్రగతికి ఇక్కడ ఉన్న యువత, నవకల్పనలే సజీవ నిదర్శనమని మంత్రి కొనియాడారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోషల్ మీడియాలో ప్రాచుర్యం పొందిన పదబంధాన్ని ప్రస్తావిస్తూ కొందరు 'నారాజ్ ఫూఫాజీలు' (అసంతృప్త వ్యక్తులు) ఎల్లప్పుడూ భారతదేశ వేగాన్ని, దేశ యువత అపార సామర్థ్యాలను శంకించేందుకు కారణాలు వెతుకుతూనే ఉంటారని ఎద్దేవా చేశారు. భారతదేశ డెమోగ్రాఫిక్ డివిడెండ్ చేజారిపోయిందా లేక దేశానికి 'భారం'గా మారిందా అంటూ కొందరు టీవీ స్టూడియోల్లో కూర్చుని అర్థంలేని చర్చలతో సమయాన్ని వృథా చేస్తున్నారని ఆర్థిక మంత్రి విమర్శించారు. ఇలాంటి నిరాశావాదుల (నయేసేయర్స్) మాటలను పట్టించుకోకుండా దేశం సాధిస్తున్న ప్రగతిని మనమంతా వేడుకలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశం సాధిస్తున్న డిజిటల్, సాంకేతిక పురోగతి 2047 నాటికి భారతదేశాన్ని సంపూర్ణ అభివృద్ధి చెందిన 'వికసిత భారత్'గా తీర్చిదిద్దే లక్ష్యానికి బలమైన వేగాన్ని నిర్దేశిస్తోందని నిర్మలా సీతారామన్ ధీమా వ్యక్తం చేశారు.

## డీఎస్సీ-ఏపీపీఎస్సీ తేడా తెలుసా?

మొదటి పేజీ తరువాయి

విద్యాశాఖ డిపార్ట్మెంట్ అధికారులు వైసీపీ చేస్తున్న ఆరోపణలకు ఆధారాలతో సహా సమాధానమిచ్చారని గుర్తుచేశారు. ఈ మధ్య జగన్ సొంత పేపర్ కు చెందినవారు ఉపాధ్యాయుల వద్దకు వెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా చెప్పాలని అడుగుతున్న దృశ్యాలు తమ దృష్టికి వచ్చాయని, టీచర్ల జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. యువగళం పాదయాత్రలో అనేకమంది నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల్ని స్వయంగా తెలుసుకున్నాను కాబట్టే.. డీఎస్సీని పట్టుదలతో, క్రమశిక్షణతో నిర్వహిస్తున్నా అన్నారు. 5 ఏళ్ల కాలంలో 30 వేల టీచర్ల పోస్టుల్ని భర్తీ చేసి చూపిస్తానన్నారు. ప్రతీ ఏటా డీఎస్సీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్ని మరింత బలోపేతం చేస్తానని.. కుదిరితే తనను ఆపడానికి ట్రై చేస్కోవచ్చని చాలెంజ్ చేశారు. డీఎస్సీకి యువత సన్నద్ధమవ్వాలని, త్వరలోనే మరో నోటిఫికేషన్ విడుదల చేస్తామని లోకేష్ వెల్లడించారు.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్‌లో భారత్ రికార్డు!




**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (ఇది కద నిజం):** దేశంలో మహిళల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం అద్భుతమైన ఫలితాలను ఇస్తోంది. అత్యంత ప్రమాదకరంగా మారుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం చేపట్టిన జాతీయ హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్ సక్సెస్‌ఫుల్‌గా దూసుకుపోతోంది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 80 లక్షలకు పైగా హ్యూమన్ పాపిలోమావైరస్ వ్యాక్సిన్ డోసులను విజయవంతంగా పంపిణీ చేసినట్లుగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. దేశంలోని ప్రివెంటివ్ హెల్త్‌కేర్ చరిత్రలో ఇదొక కీలక మైలురాయిగా మంత్రిత్వ శాఖ అభివర్ణించింది.

14 ఏళ్ల బాలికల లక్ష్యంగా స్పెషల్ క్యాంపెయిన్..

మహిళల ప్రాణాలను హరిస్తున్న ప్రధాన క్యాన్సర్లలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ప్రముఖమైనది. దీనిని మూలాల నుంచే అరికట్టాలనే లక్ష్యంతో, సరిగ్గా 14 ఏళ్ల వయస్సు నిండిన బాలికలను టార్గెట్ చేస్తూ ఈ దేశవ్యాప్త మెగా క్యాంపెయిన్‌కు రూపకల్పన చేశారు. భవిష్యత్తులో ఈ మహమ్మారి బారిన పడకుండా యువతను ముందస్తుగా రక్షించడమే ఈ వ్యాక్సినేషన్ ప్రధాన ఉద్దేశం. అయితే, ప్రాణాలను రక్షించే టీకాను సామాన్యులకు కూడా అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఈ సింగిల్ డోస్ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఎలాంటి రుసుము లేకుండా పూర్తిగా ఫ్రీగానే అందిస్తున్నారు.

వాక్సినేషన్‌లో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్

ఈ జాతీయ ఆరోగ్య ఉద్యమంలో పలు రాష్ట్రాలు విశేష చొరవ చూపుతున్నాయి. ముఖ్యంగా జాబితాలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా దూసుకుపోతోంది. కేంద్రం అందించిన లక్ష్యాల్లో ఇప్పటికే రాష్ట్రంలోని 14 ఏళ్ల వయసు గల బాలికలకు దాదాపు 98 శాతం పైగా వ్యాక్సినేషన్‌ను పూర్తి చేసి రికార్డు సృష్టించింది. ఆ తర్వాతి స్థానంలో 81 శాతం వాక్సినేషన్‌తో తమిళనాడు ఉంది.

## ఐటీ జాబ్స్‌కు తెలంగాణ బిగ్ బూస్ట్!



**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (ఇది కద నిజం):** గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన ఐటీ హబ్స్, టవర్లపై అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. యాంకర్ పార్టనర్స్ లేదా ఇండస్ట్రీ పార్టనర్స్ భాగస్వామ్యం లేకుండానే గతంలో వీటిని నిర్మించడం వల్ల చాలా చోట్ల ఇవి నిరుపయోగంగా మారాయని తెలిపారు. నిజామాబాద్ ఐటీ టవర్, ఐటీ హబ్‌పై శాసనసభ్యుడు అడిగిన ప్రశ్నకు శ్రీధర్ బాబు శాసనసభ వేదికగా సమాధానమిచ్చారు. ప్రణాళికారాహిత్యంతో మూతపడిన ఐటీ హబ్‌లను తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని స్పష్టం చేశారు.

"హైదరాబాద్‌పై ఒత్తిడిని తగ్గించేందుకు.. నల్గొండ, ఆదిలాబాద్, మహబూబ్ నగర్, కరీంనగర్ లాంటి టైర్ - 2 నగరాలకూ ఐటీ కంపెనీలకు విస్తరిస్తున్నాం. త్వరలోనే ఆదిలాబాద్‌లో ఐటీ హబ్/టవర్‌ను లాంఛనంగా ప్రారంభించబోతున్నాం. యాంకర్ పార్ట్ నర్స్/ఇండస్ట్రీ పార్ట్ నర్స్ ముందుకొస్తే కొత్తగా ఐటీ హబ్స్/టవర్లను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి కేంద్రం ఏ మాత్రం సహకరించడం లేదు. ఈ విషయంలో బీజేపీ సభ్యులు చొరవ తీసుకోవాలి. తెలంగాణ యువతకు మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేలా మా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. గత రెండేళ్లలో 75కి పైగా జీసీసీలు హైదరాబాద్ లో ప్రారంభమయ్యాయి. ఇది దేశంలోనే రికార్డు. రెండేళ్ల హయాంలో లక్ష మంది యువతకు కొత్తగా ఉద్యోగాలు దక్కాయి. త్వరలోనే కొత్త జీసీసీ పాలసీని తీసుకొస్తున్నాం. ఇందుకు సంబంధించిన కసరత్తు కొనసాగుతోంది. ఐటీ కంపెనీలకు సంబంధించిన కాంప్రెహెన్సివ్ ఎకో సిస్టంను అభివృద్ధి చేయడంలో డేటా సెంటర్లు కీలక పాత్ర పోషించబోతున్నాయి. అందుకే.. వాటిపైన ప్రత్యేక దృష్టి సారించాం. రాబోయే రోజుల్లో డేటా సెంటర్ల వల్ల ఏర్పడబోయే సవాళ్లను ఎదుర్కొనేలా ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టాం. స్థానిక అవసరాలకు ఇబ్బంది తలెత్తకుండా డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ ను అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. టైర్ 2, టైర్ 3 నగరాలు, పట్టణాల్లోనూ డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం." అని శ్రీధర్ బాబు సమాధానమిచ్చారు.

## నాలుగేళ్ల చిన్నారిపై పైశాచికం!



**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (ఇది కద నిజం):** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో నాలుగేళ్ల చిన్నారిపై జరిగిన అత్యాచారం ఘటన సంచలనం రేపుతోంది. అమ్మ నాన్న తర్వాత ఆలనా పాలనా చూసి విద్యా బుద్దులు నేర్పాల్సిన గురువులే అత్యాచారానికి పాల్పడితే ఎవరిని నమ్మి పాఠశాలను పంపేదని తల్లిదండ్రులు తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధర్మపురిలోని ఓ పాఠశాల కరస్పాండెంట్ చల్లా శ్రీనివాస్ అభం శుభం తెలియని నాలుగేళ్ల చిన్నారిపై మూడు రోజుల క్రితం అత్యాచారానికి పాల్పడి నట్లు బంధువుల ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి సమీపంలోని ఓ సూల్లో చేరి చదుకుంటోంది. ఈ క్రమలోనే ఆ స్కూల్ కరెస్పాండెంట్ చల్ల శ్రీనివాస్ గత మంగళవారం ఆ చిన్నారిని స్కూల్లోని రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. స్కూలు నుంచి ఇంటికి వెళ్లిన చిన్నారికి రక్త స్రావం జరుగుతుండటం తల్లి గమనించింది. ఏం జరిగిందని తల్లి. ఆ చిన్నారిని ప్రశ్నించటం తో ఆమె జరిగిన విషయం చెప్పింది.

అత్యాచార ఘటన పై చిన్నారి తల్లి బంధువులతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితుడు చల్ల శ్రీనివాస్ ను అదుపులోకి తీసుకొని ఫోక్సో కేసు నమోదు చేశారు. దీనిపై డి ఎస్పీ పురుషోత్తం రెడ్డి గురువారం కూలంకషంగా విచారణ చేసి నిందితున్ని ఫోక్సో కేసులో అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఇంతలోనే బంధువులు అగ్రహించి స్కూలు పై దాడి చేసి ఫర్నిచర్ పూర్తిగా ధ్వంసం చేశారు. అలాగే విద్యాశాఖ అధికారులు స్కూల్ పర్మిషన్ రద్దు చేస్తున్నామని దీనిలో చదువుతున్న 170 మంది విద్యార్థులు సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేరి విద్యాభ్యాసం చేయాలని సూచించారు. ఈ ఘటన లో పిల్లల తల్లి దండ్రులు తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలను బయటకు పంపించాలంటేనే భయం వేస్తుంది. ఎవరిని నమ్మాలో ఏ రూపంలో మృగాలు తమ పిల్లలను కాటు వేయడానికి కాపు కాసి ఉంటారో తెలియటం లేదని పిల్లల తల్లిదండ్రులు తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సీఎం బ్రదర్స్ భూదందా?

మొదటి పేజీ తరువాయి

దోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్నారని, ఈ విషయాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని సముద్రలింగాపురం ఊర్లో 800 ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సమాంతర రెవెన్యూ వ్యవస్థ నడుస్తోందని విమర్శించారు. సీఎం బ్రదర్స్ భూములను కొల్లగొడుతున్నారని, మంత్రుల ముఠా 'అలీ బాబా అరడజన్ దొంగల్లా' తయారైందని ఆరోపించారు. మంత్రుల వాటాల వివాదంలో భాగంగానే మంత్రి పదవి నుంచి ఒకరిని బర్తరఫ్ చేశారని పేర్కొన్నారు. 'తమ్ముడు లెట్స్ దూ కుమ్ముడు' అన్నట్లుగా సీఎం బ్రదర్స్ దోచుకుంటున్నారని కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు.

బ్లాక్‌మెయిలర్ పాలన..

గతంలో సీఎం రేవంత్ రెడ్డి ఆర్టీఐని అడ్డం పెట్టుకొని బ్లాక్‌మెయిల్ చేసేవాడని, వీరప్పన్ అటవీ శాఖ మంత్రి అయితే ఎలా ఉంటుందో.. రేవంత్ రెడ్డి అనే బ్లాక్‌మెయిలర్ ముఖ్యమంత్రి అయితే అలానే ఉందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అత్తసొమ్ము అల్లుడికి దానం చేసినట్లుగా నగరం నడిబొడ్డున ఉన్న పారిశ్రామిక భూములను, మూసీ సుందరీకరణ పేరుతో వేల ఎకరాలను అనుచరులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఫ్యూచర్ సిటీలో 200 కోట్ల విలువ చేసే భూములను కేవలం రూ.7 కోట్లకే కట్టబెట్టారని మండిపడ్డారు. 2014కు ముందు భూములు కొనాలంటే మానసిక అనుమానాలు ఉండేవి కానీ, కేసీఆర్ సీఎం అయిన తర్వాత చెరువులకు నీటిని అందించి ఎకరం 5 లక్షల భూమిని 50 లక్షలకు చేర్చారని గుర్తుచేశారు. కొంగర కలాన్ లో కలెక్టరేట్ నిర్మించి భూముల రేట్లు పెంచామని తెలిపారు. రాబోయే రెండేళ్లలో కేసీఆర్ సీఎంగా రావడం ఖాయమని, 22ఏ తో నిషేధిత జాబితాలో పెట్టిన భూములన్నింటినీ కాపాడుకుంటామని కేటీఆర్ అన్నారు.

## గ్రామ ఖజానాకు గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి

స్థానిక సంస్థలు వాటి అధికారాలతో.. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం పన్నులు, సుంకాలు, ఫీజులు వసూలు చేసి స్థానికంగా ఖర్చు చేసే అధికారం ఉందని మంత్రి సీతక్క తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 2018లో తీసుకొచ్చిన చట్ట సవరణతో స్థానికంగా ఖర్చు చేసే అవకాశం లేకుండా పోయిందని.. పంచాయతీలకు వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీలో జమ చేసేలా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మున్సిపాలిటీలకు వచ్చే ఆదాయాన్ని వినియోగించుకునే అవకాశం కల్పించి.. గ్రామాలను మాత్రం పట్టించుకోలేదన్నారు. ఈ విధానాన్ని మారుస్తూ పంచాయతీలు కూడా సొంత ఆదాయం ఇకపై బ్యాంకుల్లో జమచేసుకుని స్థానిక అవసరాల కోసం వినియోగించుకునేలా ప్రజాప్రభుత్వం సవరణ చేసినట్లు మంత్రి సీతక్క తెలిపారు.

పంచాయతీలకు 2018కి ముందు రిజిస్ట్రేషన్ల స్టాంపు డ్యూటీలో కూడా పన్ను వచ్చేదని గుర్తు చేశారు మంత్రి సీతక్క. గత ప్రభుత్వం ఆ పన్నుకు కోత విధించిందన్నారు. త్వరలోనే ఈ అంశంపై కూడా చర్చించి ఓ నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పంచాయతీలకు ప్రతినెలా రూ.50 కోట్లు విడుదల చేస్తున్నామని.. కేంద్రం నుంచి 2025-26లో రెండో విడత కింద రూ.619 కోట్లు రావాల్సి ఉందన్నారు. మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల అంశాన్ని మంత్రి ప్రస్తావించారు.. ఈ బిల్లుల్లో ఇతర శాఖల పనులు కూడా ఉన్నాయని.. రూ.లక్ష వ్యయం చేసే పరిమితి ఉన్న చోట రూ.కోటి చేశారని.. ఈ అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. గ్రామాల్లో అక్టోబర్ తర్వాత పొలం బాటలు నిర్మిస్తామని.. ఎన్నికలు జరగని ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న 52 పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మల్టీపర్పస్ సిబ్బంది జీతాల పెంపునకు ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నాయన్నారు మంత్రి సీతక్క.

## పనీర్ లవర్స్‌కు బిగ్ షాక్.. తెలంగాణలో నిషేధం




**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (ఇది కద నిజం):** రాష్ట్రంలో ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. పాలతో సంబంధం లేకుండా రసాయనాలు, ఇతర పదార్థాలతో తయారుచేసే నాన్-డెయిరీ లేదా కృత్రిమ పనీర్ తయారీ, విక్రయాలపై ఏడాది పాటు నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ స్టాండర్డ్స్ అథారిటీ కమిషనర్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006' నిబంధనల ప్రకారం ఈ నిషేధాజ్ఞలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు.

నిషేధంలోని కీలక అంశాలు..

రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి నాన్-డెయిరీ/కృత్రిమ పనీరు తయారు చేయడం, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ చేయడం, పంపిణీ చేయడం లేదా విక్రయించడం పూర్తిగా నేరం. ఈ నిషేధం 2026, సెప్టెంబర్ 10వ తేదీ నుంచి అమల్లోకి వచ్చి.. ఒక సంవత్సరం పాటు కొనసాగుతుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం సెప్టెంబర్ 10న గెజిట్ నోటిఫికేషన్ (నెం. 807) జారీ చేసింది. అసలైన పనీర్ పేరుతో మార్కెట్‌లో విక్రయిస్తున్న నకిలీ, రసాయనిక పనీర్ వల్ల ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని, నిబంధనలు ఉల్లంఘించి కృత్రిమ పనీర్ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# అనారోగ్య బాధితులకు అండగా సీఎం సహాయ నిధి

## - పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



ఇది కద నిజం, కుక్కునూరు: అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. కుక్కునూరు మండలంలోని పెద్దరావిగూడెం గ్రామానికి చెందిన పల్లెల మరేశ్వరి వైద్య ఖర్చుల కోసం మంజూరైన రూ.66,572 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమెకు స్వయంగా అందజేశారు. పల్లెల మరేశ్వరి అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం స్థానిక జనసేన నాయకులను సంప్రదించారు. వారి సూచన మేరకు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు క్యాంపు కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును పరిశీలించిన ముఖ్యమంత్రి కార్యాలయం మెరుగైన వైద్య సహాయం కోసం రూ.66,572 ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది. మంజూరైన చెక్కును ఎమ్మెల్యే చిర్రి బాలరాజు లబ్ధిదారురాలు పల్లెల మరేశ్వరికి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలు మాట్లాడుతూ, తనకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో పాటు కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షులు మంత్రి గోపాలకృష్ణ, నాయకులు చల్ల కోటి, గాడిద వెంకటేశ్వర్లు, భద్రి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన జడ్పీహెచ్ఎస్ చీరవల్లి విద్యార్థులు

## - డిస్కస్ త్రోలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన ఎన్. రాజేంద్ర సాయి



ఇది కద నిజం, కుక్కునూరు: ఏలూరు జిల్లా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో జడ్పీహెచ్ఎస్ చీరవల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 9, 10 తేదీలలో ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో విద్యార్థులు వివిధ విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరిలో 9వ తరగతి విద్యార్థి ఎన్ రాజేంద్ర సాయి అండర్-18 విభాగంలో డిస్కస్ త్రోలో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. వచ్చే నెల 2 నుంచి 4వ తేదీ వరకు కర్నూలులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో రాజేంద్ర సాయి పాల్గొననున్నాడు. విద్యార్థి సాధించిన విజయంపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి రాజేంద్ర సాయిని అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సమావేశం



ఇది కద నిజం,హైదరాబాద్: గుడిమల్కాపూర్‌లో శ్రీ వెంకటేశ్వర లేబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఎస్‌బీఐ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమం, బాగోగులపై చర్చించారు. ఈ కార్యక్రమానికి స్థానిక టీఆర్ఎస్ సీనియర్ నేత శ్రీధర్ సాగర్ హాజరయ్యారు. నియోజకవర్గంలో భవన నిర్మాణ కార్మికులకు ఎలాంటి సమస్య ఎదురైనా వారి తరఫున నిలబడి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలి : పద్మారావు గౌడ్




ఇది కద నిజం ,సికింద్రాబాద్, సెప్టెంబరు 11 : పర్యావరణ పరిరక్షణకు ప్రాముఖ్యతను కల్పించాల్సి ఉందని, ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవాళి మనుగడ సాధ్యమని గుర్తించాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. జీహెచ్ఎంసీ ఆద్వర్యంలో సికింద్రాబాద్ లో చేపట్టిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని పద్మారావు గౌడ్ శుక్రవారం సితాఫలమండీ లోని తన క్యాంపు కార్యాలయంలో లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవలి కాలంలో పర్యావరణ అనుకూల విధానాల పట్ల ప్రజల్లో సానుకూలత వ్యక్తం అవుతోందని అన్నారు. మట్టి వినాయకులను వినియోగించడం పర్యావరణానికి అవసరమని అన్నారు. బల్దియా అధికార యంత్రాంగం తాయారు చేయించి అందించడం ఆనందకరమని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ సామల హేమ, అధికారులు, నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చిన్న గౌరారంలో ఆదర్శవంతమైన పుట్టినరోజు వేడుక

## పుట్టినరోజు సందర్భంగా అంగన్వాడి చిన్నారులకు పలకలు పంపిణీ



ఇది కద నిజం , ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: ఆర్భాటాలకు దూరంగా సమాజసేవే లక్ష్యంగా పుట్టినరోజు వేడుకలను జరుపుకోవడం అభినందనీయమని కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని చిన్న గౌరారం అంగన్వాడి టీచర్ మంగమ్మ అన్నారు. వారధి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చిన్న గౌరారం అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ఉపాధ్యక్షుడు పెరుమాళ్ల సంజీవ్ తన కుమార్తె పెరుమాళ్ల సంధ్యారాణి (నిమ్మి) పుట్టినరోజును పురస్కరించుకుని ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలోని సుమారు 20 మంది చిన్నారులకు చదువుకు ఉపయోగపడే పలకలను, అలాగే పాఠశాల అవసరాల నిమిత్తం ఒక గోడ గడియారాన్ని విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వారధి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జి. శ్రీనివాస్ గౌడ్, సీనియర్ కోశాధికారి బి. బసవయ్య హాజరై చిన్నారులకు స్వయంగా పలకలను పంపిణీ చేశారు. సొంత ఖర్చులతో ఆడంబరాలకు పోకుండా, పేద చిన్నారుల విద్యకు తోడ్పడేలా ఉపయోగపడే సామగ్రిని అందించిన సంజీవ్‌ను మరియు వారధి సంస్థ సభ్యులను అంగన్వాడి సిబ్బంది కొనియాడారు. నిర్వాహకులకు టీచర్ మంగమ్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొత్త పలకలను అందుకున్న అంగన్వాడి చిన్నారులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రజా సానుకూల అభిప్రాయంలో నెల్లూరు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానం

## నెల్లూరు జిల్లా 76.6 శాతం స్కోర్‌తో రాష్ట్రంలో ప్రథమ ర్యాంకు

## నెల్లూరుజిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను ప్రత్యేకంగా అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



నెల్లూరు జిల్లా నెల్లూరు కలక్టరేట్(ఇది కద నిజం):- ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అందించడంలో నెల్లూరు జిల్లా సాధిస్తున్న ప్రగతికి మరో గుర్తింపు లభించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో గురువారం జరిగిన జిల్లా కలెక్టర్ల 8వ సమావేశంలో జిల్లాల వారీగా ప్రజల సానుకూల అభిప్రాయాల (పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్)పై నిర్వహించిన సమీక్షలో ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా 76.6 శాతం స్కోర్‌తో రాష్ట్రంలో ప్రథమ ర్యాంకు సాధించింది.

ఈ సందర్భంగా ప్రజల సానుకూల అభిప్రాయంలో నెల్లూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం పట్ల జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ సాధించిన ఈ ఫలితాన్ని ప్రశంసించిన ముఖ్యమంత్రి, ఇదే స్ఫూర్తితో మరింత వేగంగా జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని సూచించినట్లు సమీక్షలో పేర్కొన్నారు.

జిల్లాలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, వివిధ శాఖల పనితీరుపై ప్రజల్లో ఏర్పడిన సానుకూల అభిప్రాయానికి ఈ ఫలితం నిదర్శనంగా నిలిచింది. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం సమన్వయంతో, నిరంతర పర్యవేక్షణతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చేస్తున్న కృషికి ఇది ప్రతిబింబంగా నిలిచింది.

ప్రత్యేకంగా ఎస్ఏఏపీ కార్యక్రమంలో పాజిటివ్ పర్సెప్షన్ 67.5 శాతం నుంచి 84.2 శాతానికి, ఎఫ్‌లైన్ సర్వేలో 70.6 శాతం నుంచి 81.4 శాతానికి, ఆర్ఓఆర్ మ్యుటేషన్లలో 68.5 శాతం నుంచి 78.5 శాతానికి గణనీయంగా పెరిగింది. ఆసుపత్రుల పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ సేవలు, గృహ నిర్మాణ పథకం, ఇసుక, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, పారిశుద్ధ్యం, పాఠశాల విద్య తదితర అంశాల్లోనూ ప్రజల సానుకూల అభిప్రాయం మెరుగుపడింది.

పాఠశాల విద్యకు సంబంధించిన ప్రజల సానుకూల అభిప్రాయం 84.4 శాతం నుంచి 86.2 శాతానికి, 3--6 ఏళ్ల చిన్నారుల సేవలపై 78.7 నుంచి 80.7 శాతానికి, గర్భిణీలు, బాలింతల సేవలపై 83.3 నుంచి 84.5 శాతానికి పెరిగింది. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ ఆసుపత్రి సేవలు కూడా 76.2 నుంచి 81.2 శాతానికి మెరుగుపడ్డాయి. కాలుష్య నియంత్రణ మండలి సేవలు 95.8 శాతం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 90.9 శాతం, పట్టణ అన్న క్యాంటీన్లు 85.9 శాతం, రీ-సర్వే 85 శాతం, రేషన్ పంపిణీ 84.5 శాతం, ఇసుక సేకరణ 83.4 శాతం సానుకూల అభిప్రాయాన్ని సాధించాయి.

రాష్ట్రంలోని 28 జిల్లాల పనితీరును పరిశీలించిన ఈ సమీక్షలో నెల్లూరు జిల్లా 76.6 శాతం పాజిటివ్ పర్సెప్షన్‌తో మొదటి స్థానంలో నిలవడం జిల్లా కలెక్టర్ నాయకత్వంలో జిల్లా యంత్రాంగం పనితీరుకు, అధికారుల సమష్టి కృషికి, క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావానికి, ప్రజల సహకారానికి నిదర్శనంగా నిలిచింది.

ప్రజల సంతృప్తినే పరిపాలనకు ప్రధాన కొలమానంగా తీసుకుని, ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, వేగంగా ప్రజలకు చేరువ చేయడంతో పాటు, ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రోత్సాహంతో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ జిల్లాను అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు.

# ఆస్తి కోసం విషప్రయోగం.. దురాశకు పరాకాష్ఠగా హత్య కుట్ర?

## రూ.25 కోట్ల ఆస్తిపై కన్ను.. కొబ్బరి నీళ్లలో విషపదార్థం కలిపినట్లు పోలీసుల విచారణలో వెల్లడి



కాకినాడ(ఇది కద నిజం)సెప్టెంబర్ 11: కోట్ల రూపాయల ఆస్తిపై ఆశ ఒక వ్యక్తిని ఎంతటి దారుణానికి ప్రేరేపించగలదో జగదీశ్వరరెడ్డి హత్య కేసులో వెలుగులోకి వస్తున్న పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి. పంచాయతీరాజ్ ఏఈ టి. నూకరాజు అల్లుడు జగదీశ్వరరెడ్డిని హత్య చేసేందుకు తానే విషపదార్థాన్ని అందించినట్లు నిందితుడు సాధిక్‌ఖాన్ పోలీసుల విచారణలో అంగీకరించినట్లు సమాచారం.

ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న సాధిక్‌ఖాన్‌ను కోర్టు అనుమతితో సర్పవరం పోలీసులు మూడు రోజులుగా విచారిస్తున్నారు. విచారణ ప్రారంభంలో తనకు ఈ ఘటనతో ఎలాంటి సంబంధం లేదని చెప్పిన సాధిక్.. పోలీసులు సేకరించిన సాంకేతిక ఆధారాలు, విషపదార్థం విక్రయానికి సంబంధించిన వివరాలు, సాక్షుల వాంగ్మూలాలను అతడి ముందుంచడంతో హత్యాయత్నానికి సంబంధించిన విషయాలను వెల్లడించినట్లు తెలుస్తోంది.

పోలీసుల విచారణలో భాగంగా, జగదీశ్వరరెడ్డిని హత్య చేయాలనే ఉద్దేశంతో ఒకసారి విషపదార్థాన్ని కొబ్బరి నీళ్లలో కలిపి ఇచ్చినట్లు సాధిక్ వెల్లడించినట్లు సమాచారం. అనంతరం జగదీశ్వరరెడ్డి కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలోనూ పలుమార్లు విషపదార్థాన్ని అందించినట్లు విచారణలో తెలిపినట్లు తెలుస్తోంది. దీంతో ఆయన ఆరోగ్యం క్షీణించి మృతి చెందుతారని భావించినట్లు సమాచారం.

అయితే చికిత్స అనంతరం జగదీశ్వరరెడ్డి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో కొంత కోలుకుని ఇంటికి వచ్చినప్పటికీ.. సాధిక్ మరోసారి విషపదార్థాన్ని పంపించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. దాన్ని ఉపయోగించిన మరుసటి రోజే జగదీశ్వరరెడ్డి మృతి చెందినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం.

ఈ కేసులో ప్రధానంగా ఆస్తి కోణం తెరపైకి వస్తోంది. జగదీశ్వరరెడ్డి భార్య సౌజన్యను వివాహం చేసుకుంటే ఆమె కుటుంబానికి చెందిన సుమారు రూ.25 కోట్ల విలువైన ఆస్తి తనకు దక్కుతుందని సాధిక్ భావించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

అయితే సౌజన్య కుటుంబం ఆ వివాహానికి అంగీకరించకపోవడంతో పాటు, కుటుంబ ఆస్తిని మనవడు, మరో కుటుంబ సభ్యుడి పేరున రాస్తామని చెప్పడంతో వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో సాధిక్ తీవ్రంగా గొడవపడి వారిని చంపేస్తానని బెదిరించినట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే వారు ఆత్మహత్య చేసుకుంటారని మాత్రం తాను ఊహించలేదని సాధిక్ విచారణలో తెలిపినట్లు సమాచారం.

# అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు మట్టి వినాయకుడిని అందించిన మంత్రి పొన్నం ప్రభాకర్

## మట్టి వినాయకుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న బీసీ సంక్షేమ శాఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 11(ఇది కద నిజం) :వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.



ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మట్టి వినాయకుడిని అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, వినాయక చవితి సందర్భంగా రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా పర్యావరణహితమైన మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని బీసీ సంక్షేమ శాఖ ప్రజలకు అవగాహన కల్పిస్తోంది.

మట్టి వినాయకులను అందించడం పట్ల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, బీసీ సంక్షేమ శాఖకు ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

మట్టి వినాయకుల వినియోగం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు సంప్రదాయ పద్ధతులను ప్రోత్సహించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజలందరూ పర్యావరణహితమైన మట్టి గణపతులను వినియోగించి వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

# సినిమా న్యూస్

## వెంకీ-త్రివిక్రమ్ కామెడీ బ్లాస్ట్!



టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద నవ్వుల సునామీ సృష్టించడానికి విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ జతకట్టారు. వీరి కలయికలో రూపొందుతున్న క్రేజీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం ఏకే47'. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా అలరించనుంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై చిన్నబాబు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌కి తమన్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఇందులో నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, వెన్నెల కిషోర్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. అక్టోబర్ 2న థియేటర్స్‌లోకి రాబోతున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది.

ఈనేపథ్యంలో.. తాజాగా, మూవీ మేకర్స్ ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ చిత్ర టీజర్ అప్డేట్ ఇచ్చారు. సెప్టెంబర్ 12న మధ్యాహ్నం 12 గంటలకు బ్లాస్టింగ్ టీజర్‌ను వదలనున్నట్లు ప్రకటించారు. "ఈసారి వినోదం మామూలుగా ఉండదు.. నెక్స్ట్ లెవల్‌కి వెళ్లబోతోంది" అంటూ చిత్రబృందం జత చేసిన క్యాప్షన్, దానితో పాటు వదిలిన వెంకటేష్ స్టైలిష్ పోస్టర్ చూస్తుంటే థియేటర్లలో నవ్వుల పండగ ఖాయమనిపిస్తోంది. త్రివిక్రమ్ రాసిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' డైలాగులు ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేశాయి. ఇప్పుడు స్వయంగా ఆయనే వెంకటేష్‌ను డైరెక్ట్ చేస్తుండటంతో, వీరిద్దరు కలిసి స్క్రీన్‌పై ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నారో అని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## సంయుక్త బర్త్‌డేకు క్రేజీ అప్డేట్!

వెండితెరపై తన గ్లామర్, అద్భుతమైన నటనతో అన్ని భాషల్లోనూ మ్యాజిక్ చేస్తున్న యంగ్ బ్యూటీ సంయుక్త మీనన్. అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోల సరసన అవకాశాలు దక్కించుకుంటూ తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను క్రియేట్ చేసుకున్నారు. ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్న ఈ భామ చేతిలో స్వయంభు, స్లమ్ డాగ్, హైంధవ, ది బ్లాక్ గోల్డ్ వంటి భారీ బడ్జెట్ సినిమాలు ఉన్నాయి. ఇక ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్ వచ్చి చేరింది. నేడు సంయుక్త పుట్టినరోజు కావడంతో సినీ ప్రియులకు, ఆమె అభిమానులకు మేకర్స్ ఒక అదిరిపోయే సర్ప్రైజ్ ఇచ్చారు. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా తెరకెక్కుతున్న 'రాపో-23' చిత్రంలో సంయుక్త హీరోయిన్‌గా జాయిన్ అయినట్లు మేకర్స్ తెలిపారు.

రాపో-23 ప్రపంచంలోకి సంయుక్త ఎంట్రీ ఇచ్చినట్లు ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాతో రామ్ పోతినేని దర్శకుడిగా మెగాఫోన్ పడుతుండటం విశేషం. అంటే కేవలం హీరోగానే కాకుండా, ఈ చిత్రానికి ఆయనే స్వయంగా దర్శకత్వం వహిస్తున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, సినిమాకు సంబంధించిన టెక్నికల్ నిపుణులు అందరూ ప్రముఖులే ఉండటం విశేషం. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అన్ని పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.




## టాలెంట్ ఉన్నా.. ఛాన్సులు లేవు!



తెలంగాణ వచ్చిన తరవాతే తాను ఇండస్ట్రీలో లేకుండా పోయానని యాంకర్, నటి ఉధయ భాను సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ మీడియా ఛానల్‌తో ఆమె మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెలంగాణ నేపథ్యలో ఎక్కువ సినిమాలు వస్తున్నాయి? మీకు ఆఫర్లు రావడంలేదా? అని రిపోర్టర్ ప్రశ్నించగా ఆమె ఎమోషనల్ అయ్యారు. తెలంగాణ నేపథ్యం ఉన్నంత మాత్రాన సినిమాలు రావని చెప్పారు. తెలంగాణ వచ్చాకనే తాను లేకుండా పోయానని అన్నారు. తెలంగాణ రాకముందే తాను ఎక్కువ షోలు చేశానని చెప్పారు. ప్రభుత్వం నిర్వహించిన ప్రోగ్రామ్‌లకు కూడా తనను హోస్ట్‌గా చేయలేదని అన్నారు. తెలంగాణ బిడ్డగా పుట్టడం వల్ల తనకు వచ్చిన అడ్వాంటేజ్ జీరో అని వ్యాఖ్యానించారు.

మిమ్మల్ని మీరు నిలబెట్టుకునేందుకు ఏమైనా చేయాలన్నారు. తనకు దేవుడు ఎంతో టాలెంట్ ఇచ్చాడని దానిని వినియోగించుకున్నానని తెలిపారు. సినిమాల్లో కొన్ని అవకాశాలు వచ్చినా తానే చేయలేదని చెప్పారు. రాజశేఖర సాంగ్ తరవాత చాలా పాటలు వచ్చాయని కానీ తాను కొన్ని హద్దులు పెట్టుకున్నాని తెలిపారు. సినిమా కథలు తనను ఇంప్రెస్ చేయలేదని అందుకే ఎక్కువ సినిమాలు చేయలేదని అన్నారు. ప్రస్తుతం తాను ప్రొడక్షన్ వైపు వచ్చినా యాక్టింగ్‌కు గుడ్ బై చెప్పలేదని తెలిపారు. ప్రొడక్షన్ పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నానని కొత్తవారికి అవకాశాలు ఇస్తూ, వారి టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తానని చెప్పారు.

## వాయువ్ తేజ్ ఫేస్ రివీల్



టాలీవుడ్ ప్రముఖ నటులు వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి దంపతులు తమ కుమారుడి ఫస్ట్ బర్త్ డే సందర్భంగా తొలిసారిగా చిన్నారి ఫొటోను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 10న వీరికి కుమారుడు జన్మించగా, ఆ బాలుడికి 'వాయువ్ తేజ్' అని నామకరణం చేసినట్లు వారు గతంలోనే ప్రకటించారు. వాయువ్ తొలి జన్మదినం కావడంతో ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ప్రేమ వివాహం నుంచి తల్లిదండ్రులుగా..

2017లో వచ్చిన 'మిస్టర్' సినిమా షూటింగ్ సమయంలో వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి తొలిసారి కలిసి నటించారు. ఆ సమయంలో మొదలైన వారి పరిచయం మంచి స్నేహంగా, ఆ తర్వాత ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో 2023 నవంబర్ 1న ఇటలీలోని సుందరమైన టస్కానీ వేదికగా ఈ జంట వివాహబంధంతో ఒక్కటైంది. ప్రస్తుతం తమ చిన్నారితో కలిసి సంతోషకరమైన జీవితాన్ని గడుపుతున్నారు.




## ట్రైలర్ లేకుండా ట్రీట్?

టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' సినిమాపై ప్రస్తుతం సోషల్ మీడియాలో క్రేజీ వార్త చక్కర్లు కొడుతుంది. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత ఈ క్రేజీ కాంబోలో వస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలున్నాయి. అయితే, సినిమాలోని సస్పెన్స్‌ను మెయింటైన్ చేయడానికి మరియు ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచడానికి మేకర్స్ ట్రైలర్ లేకుండానే సినిమాను నేరుగా థియేటర్లలోకి తీసుకురావాలని ఆలోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

అయితే ఈ ప్రచారంపై చిత్ర యూనిట్, మేకర్స్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. సినిమాకి సంబంధించిన ప్రమోషన్స్ మరియు ఇతర అప్‌డేట్స్ విషయంలో ఎలాంటి ప్రయోగాలు చేస్తున్నారనేదానిపై క్లారిటీ రావాల్సి ఉంది. మరోవైపు, ఈ సినిమా తాజాగా షూటింగ్ పూర్తి చేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా జరుపుకుంటోంది. ఇప్పటికే విడుదలైన 'ది ప్యారడైజ్' టీజర్ మరియు 'ఆయా షేర్', 'ఎషనాగుల' లాంటి సాంగ్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.